


# ప్రయత్నం ఫలించింది

సరస్వతీదేవి శోకమూర్తియై పోతనామాత్యునకు ప్రత్యక్షమయింది. ఆమెను చూచి హృదయావేదన నర్థం చేసుకున్నవాడై 'కాటుకకంటినీరు' అనిఒకఅద్భుత పద్యాన్ని చదువుతాడు. ఆమె దానితో ఓదార్పుచెంది తిరిగి అంతర్ధాన్నమవుతుంది.

కాళిదాసు కూడా దేవీ వుపాసకుడే. అసలుపుట్టుకతో మూర్ఖుడు. తను కూర్చున్న చెట్టుకొమ్మను తనేనరుక్కున్నంతటి మూర్ఖుడు. తనభార్యవల్ల కాళీమాతప్రత్యక్షమయి రెండుచేతులలో రెండు గిన్నెల పాయాసాన్ని చూపించి నీకేది కావాలో తీసుకో అన్నంతనే, ఆయన రెండు గిన్నెలూ తీసుకొని తాగేస్తాడు. తాగిన తక్షణం "మాణిక్యవీణాం" అని అద్భుత శ్లోకం ఆయన నోటివెంట వెలువడుతుంది.

అసలు యివన్నీ వుదాహరణలు. ఎందుకు చెప్పుకొస్తున్నాను అంటే నాకు ఎవరైనా పదిమందిచేత పొగడబడుతున్నారు అంటె, వారినిచూచి ఈర్ష్యపడే స్వభావం కలవాడిని. వారిలో ఏ విద్యచేతనైతే పలువురిచేత పొగడబడుతున్నారో ఆ విద్య నాకు రావాలని, నేను కూడా అలాంటి గౌరవాన్ని పొందాలని వుండేది.

కాళిదాసు, పోతన్న మొదలగు పెద కవులు వ్రాసిన వ్రాతలు చదివినప్పుడు ఎంతోహాయిగా వుండేది. నాకూఏదేవియో ప్రత్యక్షమై నా నాలుకపై వ్రాస్తే బాగుం

డును. నేను యేదంటే అది అయిపోతే బాగుండును. అనేకోరికవుండేది. అంచేత ప్రతీరోజు దేవి ఆలయానికి ప్రొద్దున్న, సాయంకాలం వెళ్ళేవాడిని. దేవినిగురించి శ్లోకాలు, దండకాలు వ్రాసుకొని కంఠస్థంచేసి అక్కడ వర్ణించేవాడిని. నేను రోజూ ప్రొద్దుటా, సాయంకాలం అక్కడకు వెళ్ళి గంటలతరబడి స్తోత్రాలు చదవటంచేత అక్కడకువచ్చిన ప్రతీవాళ్లూ అనుకునేవారు. "మనరామచంద్రుడు గారి అబ్బాయికి మతిపోలేదుకదా!ఎప్పుడుచూచి నాఇక్కడ దేవుండి మంత్రాలు చదువుతున్నాడు. ఇదివరకెన్నడూ ఈఛాయలకేవచ్చాడు కాదు. ఇంకా జీవితంలో అనుభవించాలిసింది ముందుంది ఏమోనమ్మా" అనిఅనుకునేవారు. ఒక టి రెండుసార్లు మా ఇంటి ప్రక్క ముసలమ్మగారు నన్నడిగారుకూడా"ఏరా మూర్తీ!ఏ పరీక్షకయినా కట్టావా ఏమిటి?" అనిఅడిగేసివూరుకున్నారేమిటి? మా అమ్మతోకూడా చెప్పారుట నాగురించి. మా అమ్మ నన్నడిగింది. ఏమని చెప్పను. ఏం చెప్పితే ఏమంటుందోనని ముభావంగా వూరుకున్నాను. ఆరోజునుండి అసలు ఆ ఛాయలకేపోవటం మానేశా.

ఇంక ఆ కాలంనాటి కవులకు స్వస్తి చెప్పి ఈ కాలంలో రాసే కవులను అనుసరిస్తే బాగుంటుందనిపించింది. ఒక పుస్తకంలో కథ లేక వ్యాసమో చదవటం. చదవగానే పోసి .... ఈ కథేనా.... నేను వ్రాయలేనేమిటి అనిపించేది. తీరా నేను వూహించుకొని కథ అనుకున్నదాని వ్రాయటానికి కాగితం మీద కలం పెట్టేటప్పటికి రెండులైనులో మూడులైనులో గబగబ కలం ముందుకు వెళ్ళేది. ఆపై ఇంక కదలనంటే కదలను గాక అని భీష్మించుకు పోయేది. ఇంకా పట్టుపట్టి ఇంకో కథ వూహించి వ్రాయడం ఉపక్రమిస్తే యే ఒకపేజో నడిచేదో తరువాత అదీ అంతే అయ్యేది. ఆ పేజీ వ్రాయటానికే నా తలప్రాణం తోక్కొచ్చేది. అప్పటికే ఎంతో పెద్ద కవి నైపోయినట్లు పోజు పెట్టేవాడిని, ఆ కథను తీసికెళ్ళి "అమ్మా నేను కథ వ్రాశానే" అని చదివి వినిపించేవాడిని. అక్కడనుండి నాలుగు మంగళహారతులు వచ్చేవి, అసలు మా అమ్మ కథ పూర్తిగా వినేదేకాదు.నాకుబాధ కలిగేది. వెంటనే కోపం వచ్చి అక్కడికక్కడే ఆ కాగితం చింపేసేవాడిని. ఇలా ఎన్ని కాగితాలయ్యాయో !ఎన్నిసార్లు మా అమ్మచేత మంగళహారతులు తిన్నానో లెక్కలేదు అయినా నేను కొద్దో గొప్పో వ్రాయడం మానలేదు,

## సుధామూర్తి

ఇలా వ్రాస్తూ, చింపుతూ ఉంటూనే ఉన్నాను. ఈ లోపులో నా మనసు ఇంకో కళమీదకు మళ్ళింది.

ఒకసారి మా వూరికి ఒక ప్రముఖ గాయకుడు వచ్చాడు. అవి త్యాగరాజ వుత్సవాలు జరుగుతున్న రోజులు. ఆ గాయకుని కచేరీకి నేనూ వెళ్ళాను.

కచేరీకి చాలామంది జనంవచ్చారు. ఆయన పాడుతున్నంతసేపూ, ఒక్క దగ్గు కూడా వినపడలేదు. నేనుకూర్చున్న చోటునుంచి కదలకుండా వుండి విన్నాను. కచేరి అయిపోయిన తరువాత అందరితోపాటు నేనూ బయటకు వచ్చేశాను.

ఇంక నాకు ఆలోచనలు మొదలైనాయి. "నేను కూడా పాడగలిగుంటే ఎంత బాగుండును! నా పేరు కూడా ఈ మాదిరిగానే మారుమోగిపోయి వుండేది." అనిపించింది. అలా అనుకొని ఒక నిర్ణయానికి వచ్చాను. రేపటినుండి మా ఊళ్ళోవున్న సంగీతం మాష్టారివద్ద ప్రయివేటుపెట్టి కనసం రెండు సంవత్సరాలు నేర్చుకోవాలని. తరువాత ఒకటి, రెండు చిన్నచిన్న కచేరీలు చేసేటప్పటికి అనుభవం వస్తుంది. తరువాత ఇల్లాంటి కచేరీలు చేయవచ్చు.

అప్పుడే ఇంకేముంది నా పేరు కూడా ఇల్లాగే మారుమోగిపోతుంది అనుకొని ఆలోచించుకుంటూ యింటికివచ్చి పడ్డా. బట్టలుకూడా విప్పుకోకుండా అల్లానే నా గదిలోకి వచ్చి, నా శరీరాన్నిమంచంమీద వాల్చాను. ఈ కమ్మనైన ఆలోచనలతో అప్పుడేనాకు అనుభూతంగా సంగీతంవచ్చేసిందనుకొని గొంతెత్తి రాగం తీయటం మొదలుపెట్టా. పక్కరూముల్లో వాళ్ళు నిమగ్నులై ఉన్నాయిగా తిరుగుతున్నారుమా యింట్లో వాళ్ళు. కాని నన్ను నా రాగాన్నీ ఆటకట్టించలేరు.

వాళ్ళుఅలా మౌనంగా వూరుకుంటే నేనుబాగా రాగంతీస్తున్నాను కాబోలునని గొంతుక శ్రావ్యంగా, వినసొంపుగావుంది కాబోలుఅనుకొని రాగాన్నికాస్త పెంచి శ్రుతిలోకి దింపాను. ముక్కున పట్టుకొన్ని ఒక్కచరణమైనా నాయిష్టం వచ్చినట్లు మెలికలుతిప్పుతూ పాడటంప్రారంభించా. అది మా నాన్నగారువచ్చేసమయం అనికూడా గుర్తుకు రాలేదు.

ఎప్పుడో వచ్చేరో మా నాన్న రానే వచ్చారు. ఆఫీసుపనులుచేసి, చేసి యింటికి వచ్చారేమో నా గార్దభ కంఠాన్ని విని భరించలేక పోయారనుకుంటాను.

"ఒరే ఎవడురా అలా ఏడుస్తున్నాడు? నోరుమూస్తావా? ముయ్యడా?" అంటూ నా గదిలోకి అడుగుపెట్టేంత వరకూ నా గానం సాగుతూనేవుంది.

"ఎందుకునాయనా, అంత పవిత్రమైన సంగీతానికి నీ గాడిద కంఠంతో కళంకాన్ని ఆపాదిస్తావు. శ్రుతి, లయబద్ధంగా పాడేదే సంగీతమంటారు. అలా పాడకపోతే పాటంకాదు. అయినా నీ మొహానికి సంగీతం కూడాను. అని ఒక్కసారి దుమ్ము దులిపేశారు ఆయన మాట వినగానే అప్రయత్నంగా ఆగిపోయింది నా గానం. కళ్ళప్పుటనీళ్ళు వచ్చేంతపర్యంతమయింది. గట్టిప్రయత్నంమీద ఆ వచ్చే దుఃఖాన్ని ఆపుకొని బయట వెరుపుగట్టు దగ్గర కూర్చొని దుఃఖానికి గ్రీన్‌సిగ్నల్ యిచ్చేశాను. అలా గంటసేపు విచారిస్తూ అప్రయత్నంగా చేతి గడియారం చూసుకున్నా, రాత్రి 9.15 అయింది.

ఒక్కసారి దుఃఖముపోయి భయం

ఆవరించింది. తొమ్మిదిన్నర అయేటప్పటికి భోజనాలదగ్గర మానాన్నగారిముందు హాజరు ప్రతివాళ్ళూ కావలసినదే. ఎవ్వరైనా ఖర్మంజాలక ఆనియమాన్నితప్పారా వాడికారోజు ఒకచక్కటి గుణపాఠం జరిగిందన్నమాట! ఒక్కసారిఆపాఠాన్ని చవిచూచిన మాట గుర్తు కొచ్చేటప్పటికి శరీరం గగుర్పొడిచింది. వెంటనే ముఖం జేబురుమాలుతో తుడుచుకొని, బట్టలన్నీ దులుపుకొని నాలుగు అంగలలో ఇంటికి వచ్చిపడ్డాను. ఇంక అప్పటినుండి ఆ సంగీత సాధనకు స్వస్థిచెప్పటం జరిగింది.

ఒకసారి, ఒకసందర్భంలో మా కాలేజీకి ఒక ప్రొఫెసరు వచ్చాడు. ఆయన వచ్చినసందర్భంలో మా ప్రిన్సిపాల్‌గారు ఒకమీటింగ్ యేర్పాటు చేశారు. అందరి కుర్రాళ్ళతోపాటు నేనూ హాజరైనాను ఆ మీటింగ్‌కు.

ఎంతచక్కగా ఇంగ్లీషులో వుపన్యసించాడు అంటు, నాకు మాటలు చాలవు వర్ణించడానికి. ఆ మాటకొస్తే ఆయన మాట్లాడినంత అనర్గళంగా నేనునామాతృభాషలోనే మాట్లాడలేను అని చెప్పుకోవచ్చు. అసలు యే సభలుజరిగినా ఎంత పెద్దవాళ్ళను కాలేజీకి ఆహ్వానించినా పిల్లికూతలూ, కుక్కఅరుపులతో సన్మానించి పంపేకుర్రాళ్ళు ఆ సమయంలో ఒక్కడు కూడా నోరుమెదపలేదు. కూర్చున్నచోటు నుంచిఎవ్వరూ లేవైనాలేదు. ఇంకేముంది ఆ వుపన్యాసాన్ని వినేటప్పటికినామనస్సు మళ్ళీ దీనిమీదకు కేంద్రీకరించింది. నేను కూడా ఇంత బ్రహ్మాండంగా ఉపన్యసిస్తే బాగుండును, నన్నుగురించికూడాకుర్రాళ్లు ఇల్లాగే చెప్పుకుంటారు కదా! అనే ఆలోచన పొడచూపింది.

ఇల్లా అనుకుంటూనే వున్నాను. ఒకసారి మా పెద్దమామయ్యకు నాకూ జరిగిన సంభాషణ గుర్తుకువచ్చింది.

ఒకసారి మా పెద్దమామయ్య మా యింటికివచ్చాడు. ఆయనంటేనాకు ప్రేమ యెక్కువ. అందులోనూ ఒకపెద్దఆఫీసరు ఆయనకుకూడా నేనంటేచాలా అభిమానం ప్రేమకూడా-

ఆ రోజు భోజనాలు ముగించుకొని యిద్దరంకలిసి మేడమీద విశ్రాంతి తీసుకుంటున్నాము. పిచ్చాపాటిమాట్లాడుతున్న సంభాషణ నా చదువు వరకూ వచ్చింది.

"ఏరామూర్తి. నువ్వు బి. ఏ. చదువుతున్నావుకదా! ఒక్క యింగ్లీషుముక్కయినా మాట్లాడలేవేరా! ఇంకెందుకురా ఏ బి.ఏ. నువ్వూనూ" అన్నాడు.

నాకుభలే కోపంవచ్చింది. పోనీ నా చదువుని గూర్చి అంటేనాకు అంతబాధ లేకపోయివుండును. బి.ఏ. డిగ్రీని గూర్చి అంతనీరసంగా అనడంతో నాకుబలే బాధ కలిగింది. ఏమనడానికైనా నా కంటెపెద్ద వాడు. ఆఫీసరు అని నాలోనేనే నోరు మూసుకొని కూర్చున్నా.

ఆ అయినా కానీ ఈకాలం చదువులు యేం చదువులులేరా? వానాకాలం చదువులు. ఈ రోజులలో డిగ్రీలు [illegible]

ళ్ళందరూ గుమాస్తాలేగా! మరి నా కాలంలో నేను ఎస్.ఎస్.ఎల్.సి. చదువుకున్నాను. దాంతోనే ఇప్పుడు ఆఫీసరు నయ్యాను. మరి నేను మాట్లాడినట్లు ఇప్పుడు డిగ్రీలు పుచ్చుకున్నవారు మాట్లాడగలరా? అన్నాడు పెద్ద గర్వంగా.

ఈమారు నాకు కోపం చాలా ఎక్కువయింది. కాని యేం చెయ్యను నిస్సహాయుణ్ణి. అల్లాగే కోపాన్ని దిగమ్రింగి "అయితే మామయ్యా అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడగలగటం ఎప్పుడు వస్తుందంటావు? అన్నాను హేళనగా.

"ప్రతి రోజూ ఇంగ్లీషుపేపరు ఆ మొదలునుంచి చివర వరకూ చదువు. ప్రతి మాటా అర్థంకానక్కరలేదు. అల్లా చదువుతువుంటే నోరు తిరుగుతుంది. పెద్దపెద్ద వారు వ్రాసిన ఇంగ్లీషుపుస్తకాలు చదువుతూవుండు. తెలియనిమాటనలా "డిక్షరీ లో తిరగై. ఇల్లా తదేక దృష్టితో తూ. చ. తప్పకుండా చేయగలిగితే ఒక్క సంవత్సరంలో నా కంటె కూడా ఎక్కువ అనర్గళంగా మాట్లాడ గలుగుతావు" అన్నాడు దీర్ఘోపన్యాస ధోరణిలో.

ఈ మాట జ్ఞాపకంవచ్చి ఒక మంచి పుస్తకం కొందామని పుస్తకాలషాపుకి వెళ్ళి "డిస్కవరీ ఆఫ్ ఇండియా" అనే పుస్తకం కొనేసాను. పుస్తకాలషాపు నుంచే రోడ్డుమీద కూడా పుస్తకం తిరగేస్తూ వస్తున్నాను. రెండుచోట్ల కారు క్రింద పడవలసినదే కాని అదృష్టం బాగుండి బ్రతికిపోయాను. అలా వస్తూ వస్తూ మధ్య మధ్య క్రీగంటి చూపులు ప్రక్కన నడిచేవారిమీద వేస్తూ, నాకేసి యెవ్వరైనా చూస్తున్నారా అని ఆలోచిస్తూ పుస్తకంలో తలదూర్చి నెమ్మదిగా నడక సాగించాను.

ఎక్కడనుండి వచ్చిందో మా నాన్నగారి కారు హారను కొట్టుకుంటూవచ్చి నా ప్రక్కన ఆగింది. ఇంకేముంది నా ప్రాణాలు పైపైనే పోయాయి! పుస్తకం మూసేసి అలాగే ఆ కారు ప్రక్కన నుంచున్నా బిక్కు బిక్కు మంటూ. ఒక మూల కాళ్ళు దడదడ కొట్టుకొని భూమి మీద నిలబడేస్థితిలో లేవు. ముచ్చెమటలూ పోశాయి.

"ఏరా బ్రతకాలని లేదా? రోడ్డుమీద ఎవరైనా పుస్తకంలో తలదూర్చి నడుస్తారటరా?" అన్నారు. ఆయనది లౌడ్ స్పీకరంత గొంతు. ఆ ప్రక్కన దారె పోయేవారు ఆ గొంతువిని ఆగి, ఏమి జరిగిందో అని చూస్తున్నారు.

ఈ లోగా కారు డోరుతీసి "లోపలికి తగులడు. నీ చదువు నువ్వూను. యేకారు క్రిందయినా పడితే యేమయిపోతావనుకున్నావు?" అన్నారు. నేను యేమీ మాట్లాడకుండా కార్లో ఎక్కి కూర్చున్నాను. నా భయాన్ని చూచి ప్రక్కనవున్న జనం పక్కున నవ్వారు. నాకు బలే చిన్నతనమనిపించింది.

భోజనాలు రాత్రి ముగిసిన తరువాత నా గదిలోకిపోయి పుస్తకాన్ని తిరగేయటం మొదలుపెట్టా. కళ్ళు మూసుకుపోతూవుంటే యిదివరకు పరీక్షలు జరుగుతున్నప్పుడు ఎక్కువసేపు మెళకువగా వుండటానికని తెచ్చుకొన్న స్లీప్ లెస్ బిళ్ళలు రెండువేసుకొని తెల్లవార్లూ చదివి పుస్తకాన్ని పూర్తిచేశా. తెల్లవారిన తరువాత కళ్ళు మండటం, కాళ్ళు లాగటం మొదలెట్టాయి. అల్లాగే పట్టుబట్టి లేచి స్నానం టిఫెను మొదలైనవి ముగించి మంచంమీద వాలాను. అంతే యెప్పుడు నిద్రపట్టిందో నాకే తెలియదు. మా అమ్మ భోజనానికి నన్ను లేపడానికివచ్చి వంటి మీద చెయ్యవేసేటప్పటికి శరీరం సలసల కాగుతోంది.మా అమ్మ కంగారుపడిపోయి డాక్టరుగార్ని, మానాన్నగార్ని ఫోనుచేసి తక్షణం రప్పించేసింది. డాక్టరు వచ్చి ఇంజెక్షను ఇచ్చి "తగ్గిపోతుంది ఫరవా లేదు అని అభయం యిచ్చి మరీ కదిలాడు అక్కడనుంచి. ఆ రోజు మొదలుకుని అమ్మ నా జ్వరం తగ్గేంతవరకూ నా మంచం వదలనేలేదు. జ్వరం తగ్గి తిరిగి పూర్వ స్థితికి వచ్చి మనిషిలాతిరగటానికి నాకు నెలరోజులు పట్టింది.

ఈ విధంగా ఎందులో తలదూరిస్తే అందులో ప్రథమసోపానంలోనే బెడిసి కొట్టేది.

వాటన్నిమాట ఎల్లా వున్నప్పటికిని నేను యేదో పిచ్చాపాటీ వ్రాయటం చింపేయటం మామూలుగానే జరుగుతూనే వుంది.ఇల్లాగే కొంతకాలంరాయగా రాయగా ఎప్పటికైనాఒక్క కథయినారాయలేకపోతానా? పేరుప్రతిష్టలు రాకపోయినా ప్రచురింపబడితే చాలు అనిపించింది. తప్పక ప్రచురించబడుతుంది అనిఒకనిశ్చయానికి వచ్చి ప్రయత్నం విడవకుండా చేశాను.

ఆ ప్రయత్నం ఈనాడు మీరు చదువుతున్న ఈ నా రచన.మరి! నా ప్రయత్నం ఫలించిందని ఒప్పుకుంటారా? ★

## సరియైన చిల్లర

హోటల్‌లో స్పెషల్ బోర్డుమీద అలా రాసి వుంది.

"సరియైన చిల్లర ఇవ్వండి"

హోటల్‌కు విచ్చేసిన ఓ పెద్దమనిషి బోర్డును చూసి సర్వర్ని పిల్చి "ఒక ప్లేట్ పదిరూపాయలకు సరియైన చిల్లర తీసుకురా అన్నాడు.

— టి. వి. ఆంటాల్